సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 4 । ఆగస్టు । 2025





## సై'డర్'

సైబరాసురులు రెచ్చిపోతున్నారు. రూ.కోట్లలో టోపీ వేస్తున్నారు.

- 8లో



## నాగావళిలో మునిగి..

నాగావళిలో మునిగి ఓ విద్యార్థి చనిపోయాడు. బూర్జ మండలంలోని లాభాం వద్ద ఘటన జరిగింది.

- 8లో

## మనోవికాస కేంద్రంలో..



శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని బెహరా మనోవికాస కేంద్రంలో చిన్నారుల మధ్య ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఎల్‌బీఎస్ కాలనీకి చెందిన యోగా మహిళల ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల మధ్య వేడుక చేశారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులు అందచేశారు.

## న్యూస్‌రీల్

### డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు



పాతపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న జాగిలాలు

పాతపట్నం: పాతపట్నంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టుతో పాటు మార్కెట్‌లోని పలు షాపుల్లో నార్కోటిక్ ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలాలతో స్థానిక ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను మరింత నిశితంగా పరిశీలించారు. గంజాయి, మద్యం, నాటుసారాతో పాటు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు ఈ తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు.

### జిల్లా హెచ్‌ఎంల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎంల సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఏపీహెచ్ఎంఏ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా వాలుతేటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎర్నాగుల వాసుదేవరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా పేడాడ దాలి నాయుడు, ఎస్.లక్ష్మణరావు, బి.రమణయ్య, ఆర్థిక కార్యదర్శిగా సీహెచ్ కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రమణ, ఎస్.కుమారస్వామి, సనపల రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### ఉత్సాహంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి జూనియర్ చెస్ ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం కొత్తరోడ్డు వద్ద సీఎస్ఎన్ ట్రస్టు కార్యాలయంలో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలబాలికలకు బహుమతులు అందించారు. ఇక్కడ విజేతలు ఈనెల 9, 10 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

### రిమ్స్ రెండో అంతస్తు నుంచి పడి మహిళ మృతి



రెండో అంతస్తు నుంచి పడిపోయి మృతి చెందిన నీలవేణి

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో రెండో అంతస్తు నుంచి పడిపోయి ఓ మహిళ మృతి చెందారు. ఆదివారం వేకువజామున మూడున్నర గంటల సమయంలో జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు, రోగి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కవిటి మండలం సీమూరు గ్రామానికి చెందిన శివంగి నీలవేణి (55) గత 15 ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల వ్యాధి తీవ్రం కావడంతో వైద్యుల సూచన మేరకు జూలై 31వ తేదీన రిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వార్డులో ఈమెను ఉంచి చికిత్స చేస్తున్నారు. ఆదివారం వేకువజామున మూడు గంటల 15 నిమిషాల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి వస్తానని తన వద్ద సహాయకురాలిగా ఉన్న కోడలికి చెప్పి వెళ్లారు. 15 నిమిషాలైనా తిరిగి రాకపోవడంతో కోడలు చూసేసరికి వార్డు పక్కనే ఉన్న కిటికీలోంచి కిందకు పడిపోయినట్లు కొందరు చెప్పడంతో వెళ్లి చూసింది. ఆమెను హుటాహుటిన ఎమర్జెన్సీ వార్డుకు తరలించగా, తలకు బలమైన గాయం తగలడంతో అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నీలవేణి భర్త మోహన్‌రావు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. కిటికీ పైన కూర్చొని ప్రమాదవశాత్తు వెనక్కి తిరగబడి పడిపోయిందని పేర్కొన్నారు. ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

# ఆ మట్టి.. మెళియాపుట్టి!

ఆ మట్టికి సాష్టాంగ నమస్కారాలు పెడతారు. అదే మట్టిని మండపంలో పెట్టి పూజలు చేస్తారు. ఫల పుష్పాదులు సమర్పించి పండగ చేస్తారు. ఆ మట్టి.. మెళియాపుట్టి. ఇక్కడ ఇరవై ఏళ్లుగా మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నారు. వినాయక చవితి, దసరా సీజన్ వచ్చిందంటే ప్రతిమల కోసం అంతా ఈ ఊరికి క్యూ కడతారు. విగ్రహాలతో పాటు దీపాలు ఇతర మట్టి సామగ్రిని కూడా తయారు చేయడం వీరి ప్రత్యేకత.



విగ్రహాలకు రంగులు వేస్తున్న దృశ్యం

- మెళియాపుట్టిలో 20 ఏళ్లుగా మట్టి విగ్రహాల తయారీ
- ఔరా అనిపిస్తున్న కళాకారులు
- దీపాలు, ఇతర సామగ్రి తయారీలో బిజీబిజీ
- పండగలు సమీపిస్తుండడంతో జోరందుకుంటున్న అడ్వాన్స్‌లు

మెళియాపుట్టి: వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కావడానికి ఇంకా కొద్దిరోజులే ఉంది. మెళియాపుట్టిలో అప్పుడే సందడి మొదలైపోయింది. ఇక్కడ మట్టితో విగ్రహాలు, పూజా సామగ్రి తయారుచేస్తూ కళాకారులు బిజీగా బిజీగా గడుపుతున్నారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ ప్రాంతంలో నివాసముంటున్న కొన్ని కుటుంబాలు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తాయి. ఏటా చిన్న విగ్రహాలతో పాటు పెద్ద పెద్ద విగ్రహాల తయారీలో వారికి మంచి పట్టుంది. వీరు తయారు చేసిన ప్రతిమలను చూస్తే ప్రతిభను కొనియాడకుండా ఉండలేం. చుట్టుపక్కల మండలాల నుంచి సైతం విగ్రహాలకు అడ్వాన్సులు ఇస్తూ విగ్రహాలు కొనుగోలు చేస్తుంటారు. ధరలు తక్కువగా ఉండడంతో పాటు విగ్రహాలు కూడా అందంగా..రంగురంగుల్లో ఆకర్షణీయంగా తయారు చేయడంతో ఎక్కువగా మెళియాపుట్టిలోనే విగ్రహాలు కొనుగోలు చేస్తామని కొనుగోలు దారులు చెబుతున్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా మట్టి విగ్రహాలు తయారు చేయడంతోనే వీరికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఎక్కువమంది కొనుగోలు చేస్తుంటారు.



విగ్రహాలు తయారు చేస్తున్న మహిళ

కొంత మంది యువత వారికి కావాల్సిన విధంగా గణపతి విగ్రహాలు తయారు చేయించుకుంటారని విక్రయదారులు చెబుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను వినియోగించి తయారు చేసే విగ్రహాల వల్ల పర్యావరణ పరిరక్షణకు భంగం కలుగుతుందని, అందుకే మట్టితోనే చేస్తున్నామని వారు చెబుతున్నారు. విగ్రహ తయారీలో కర్రలు, మట్టి, వరిగడ్డి, కొన్ని తాళ్లను మాత్రమే వారు వాడుతారు. 20 ఏళ్లుగా వీరు వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలను తయారు చేసి భక్తులకు అందిస్తున్నారు. ఏటా కొత్తదనాన్ని తీసుకొస్తున్నారు.

### ప్రభుత్వ సహకారం కావాలి



మట్టితోనే విగ్రహాలు తయారు చేయడంతో సంతృప్తి చెందుతున్నాం. మట్టితో విగ్రహాలు తయారు చేయడం చాలా కష్టం. తయారు చేసిన తర్వాత చాలా రోజులు ఉంచి అప్పుడు రంగులు వేయాలి. వాటిని భద్రపరచడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నాం. రేకుల షెడ్లు వేసుకోవడానికి ప్రభుత్వం లోన్లు మంజూరు చేయాలి.

– బూరగాన సవరయ్య, విగ్రహ తయారీ దారుడు, మెళియాపుట్టి గ్రామం

### మట్టి ప్రమిదలకు గిరాకీ ఎక్కువ



మట్టి ప్రమిదలు నిత్యం తయారుచేస్తూనే ఉంటాం. వినాయక ఉత్సవాలకు అత్యధిక మండపాల్లో దీపారాధన చేస్తారు. వేల సంఖ్యలో ప్రమిదలు కొనుగోలు చేస్తారు. వినాయక చవితి వస్తే ఇంటిల్లిపాదీ నిమగ్నమై పనులు చేస్తాం.

– రేఖాన ఉమ, మెళియాపుట్టి గ్రామం

# పేరు మార్పు.. అమలులో ఏమార్పు..!



తీర ప్రాంతంలో కొత్తపేట గ్రామ సచివాలయం

- వైఎస్సార్ బీమా పేరు మార్పుతో సరిపెట్టిన కూటమి ప్రభుత్వం
- ఏడాది గడిచినా దరఖాస్తులు స్వీకరించని వైనం
- పరిహారం కోసం మృతుల కుటుంబాల ఎదురుచూపు

వజ్రపుకొత్తూరు: కుటుంబ పెద్దలను కోల్పోయిన నిరుపేద కుటుంబాలను ఆదుకునే వైఎస్సార్ బీమా విషయంలో కూటమి సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి రాగానే చంద్రన్న బీమాగా పేరు మార్చింది తప్ప అమలు చేసింది లేదు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా పేద బడుగు బలహీన వర్గాల నుంచి దరఖాస్తులు స్వీకరించకపోవడంతో బడుగు బలహీన వర్గాల ప్రజలు బీమాకు నోచుకోలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చారు. సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు అందజేస్తామని ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టారు. అధికారం చేపట్టిన తర్వాత దరఖాస్తు తీసుకోవడానికి కూడా తీరిక లేకపోయింది. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో గ్రామాలకు వెళ్తున్న కూటమి నేతలపై ప్రజల నుంచి చంద్రన్న బీమాపై ప్రశ్నల వర్షం కురుస్తోంది.



**వెబ్‌సైట్‌ను తొలగించి..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమాకు సంబంధించిన వెబ్‌సైట్‌ను తొలగించింది. అప్పటి నుంచి చంద్రన్న బీమా పథకంగా పేరు మారింది. మృతి చెందిన కుటుంబాల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు వెబ్‌సైట్‌లో అవసరమైన మార్గదర్శకాలను సైతం విడుదల చేయలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదేశాలు రాలేదని అటు వెలుగు, ఇటు సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికే పలాస నియోజకవర్గంలో మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 1250 మంది వరకు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారి మృతి చెందగా వారికి పైసా బీమా సాయం అందలేదు. జిల్లావ్యాప్తంగా వీరి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది.

**జగనన్న పాలనలో ఇలా..**

గత వైఎస్సార్ సీపీ హయాంలో పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే వలంటీర్‌లు, గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది మృతుని ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10వేలు అందించేవారు. మిగతా సొమ్ము 25 రోజుల్లో నామినీ బ్యాంక్ ఖాతాలో జమయ్యేది. ఈ బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేది. పేదలకు ఎంతో ఉపయోగపడిన వైఎస్సార్ బీమాను కేవలం పేరు మార్పుతో సరిపెట్టి పథకానికి మంగళం పాడేశారని ప్రజలు విమర్శిస్తున్నారు.

### బీమా మంజూరు చేయాలి

ఇప్పటికే మృతి చెందిన కుటుంబాలు చాలా ఉన్నాయి. వారంతా బీమా వస్తుందనే ఆశతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చంద్రన్న బీమా పథకం అమలు చేయాలి. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి.

– దున్న బాలరాజు, అమలపాడు

### హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో ప్రభుత్వం విఫలమైంది. ప్రమాద వశాత్తు మృతిచెందిన బాధితు ల కుటుంబ సభ్యులు బీమా సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు. ఈ పథకం అమలు చేయకపోవడం సర్కారు వైఫల్యం.

– వంక చిరంజీవిరావు, కంబాలరాయుడుపేట

## యోగా..మంచిదేగా





యోగాసనాల జిల్లా చాంపియన్‌షిప్- 2025 పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. జిల్లా యోగాసన స్పోర్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా మొత్తం 310 మంది పాల్గొన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. 12 విభాగాల్లో 48 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు.

– నరసన్నపేట

## ప్రమాణం చేసి చెబుతున్నాం..



సామూహికంగా ప్రమాణం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

ఇక్కడేమీ ప్రమాణ స్వీకారం జరగడం లేదు. అలాగని వీరేమీ తప్పు చేసి ప్రమాణం చేయడం లేదు. కంచిలిలోని కంచమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలు జూన్ రెండు నుంచి పదో తేదీ వరకూ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు విరాళాల సొమ్ము ఖర్చును అణాపైసాతో సహా వివరించారు. ఒక్క రూపాయి కూడా అవినీతి జరగకుండా జాగ్రత్త పడ్డామని రాముని సన్నిధిలో ప్రమాణం చేసి మరీ చెప్పారు. తమ నిజాయితీకి ఆ దేవతే సాక్షి అని నిండు మనసుతో తెలిపారు.

– కంచిలి

## విసిగి.. వేసారిపోవడంతో..



టెక్కలి జగతిమెట్ట వద్ద జగనన్న కాలనీలో స్థానికులు సొంతంగా నిధులు సమకూర్చుకుని వేస్ట్ మెటీరియల్‌తో గోతులు పూడ్చుతున్న దృశ్యం

టెక్కలి జగతిమెట్ట సమీపంలోని జగనన్న కాలనీలో కాలనీవాసులు సొంతంగా నిధులు సమకూర్చుకుని రోడ్లు బాగు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన కనిపించడం లేదు. దీంతో సర్కారు తీరుతో విసిగిపోయి కొన్ని వీధుల్లో సొంతంగా రోడ్లు వేసుకుంటున్నారు.

– టెక్కలి



జగనన్న కాలనీలోని ఓ వీధిలో అధ్వానంగా కనిపిస్తున్న రహదారి

## ముగ్గురు నేరస్తుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 16వ తేదీ రాత్రి జరిగిన దొంగతనంపై నమోదైన కేసులో నిందితులు దొరికారు. పట్టుబడిన ముగ్గురు నిందితుల వివరాలను కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు ఆదివారం వెల్లడించారు. మొత్తం 58 గ్రాముల బంగారు ఆభరణాలు, 450 గ్రాముల వెండి వస్తువులు, డబ్బులు రూ.8వేలు, రెండు మోటార్ సైకిళ్లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కోసంగిపురం కూడలి వద్ద ఒడిశాకు చెందిన సంతోష్ సాహు, రాజ్‌కుమార్ సేతి, బబుల్ సతీలను అరెస్టు చేశారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన సీఐ, పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారని డీఎస్పీ వెల్లడించారు.

## పదో తరగతి పాఠ్యపుస్తకంలో ఉత్తరాంధ్ర జానపద కళలకు చోటు

పలాస: పదో తరగతి పాఠ్య పుస్తకంలో ఉత్తరాంధ్ర జానపద కళలకు చోటు లభించింది. పదో తరగతి తెలుగు వాచకంలో తెలుగు పరిమళం పేరిట ఉత్తరాంధ్ర జానపద కళలకు స్థానం కల్పించారు. జానపద కళలైన తప్పెటగుళ్లు, ధింసా వంటి కళలను విద్యార్థులకు పరిచయం చేశారు. పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జానపద కళాపీఠం అధ్యక్షుడు, రచయిత బద్రి కూర్మారావు రచించిన ఉత్తరాంధ్ర జానపద కళలు పుస్తకం నుంచి వీటిని పుస్తకంలో చేర్చారు.

# మంచినీళ్లపేటలో టీడీపీ నేతల రచ్చ



మంచినీళ్లపేటలో రచ్చ చేసేందుకు వచ్చిన టీడీపీ నేతలను దీటుగా ఎదుర్కొంటున్న గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం అడ్డుకునే యత్నం
- దీటుగా బదులిచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఇరు వర్గాల మధ్య వాగ్వాదం

వజ్రపుకొత్తూరు: మండలంలోని మంచినీళ్లపేట గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు రచ్చ చేశారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొన్న ఈ కార్యక్రమంలో.. స్థానిక వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వంక లక్ష్మయ్య చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. స్థానికంగా సీదిరి చేసిన మేలును వివరించారు. ఆయన మాట్లాడుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన టీడీపీ నేతలు గుళ్ల చిన్నారావు, వల్లభరావు, సోడిపిల్లి దీనారావు, సిరమయ్య, బుంగ వరయ్య, బారికయ్య, జి.తారకేశ్వరరావు, బారికయ్య నేరుగా తగాదాకు దిగారు. దీంతో అక్కడే ఉన్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, స్థానిక మహిళలు, టీడీపీ నేతలకు దీటుగా బదులిచ్చారు. కాసేపు ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్ తన సిబ్బందితో వచ్చి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఇరుపార్టీల నేతలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీంతో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వచ్చే శనివారం మళ్లీ నిర్వహిస్తామని ఎస్ఐను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశవరావు, గ్రీవెన్స్ విభాగం కన్వీనర్ ఇరోతు హేమంత్‌రాజు, మండలాధ్యక్షుడు తిర్రి రాజారావు, కార్యదర్శి దున్న బాలరాజు, గొరకల విశ్వనాథం, వంక చిరంజీవులు, సీనియర్ నేత పాలిన శ్రీనివాసరావు, జిల్లా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వివాహిత ఆత్మహత్యాయత్నం



అపస్మారకస్థితిలో పడివున్న మహిళ

టెక్కలి రూరల్: మండలంలోని డమర గ్రామ సమీపంలో రహదారి పక్కన ఒక మహిళ నోటినుంచి నురగలు కక్కుకుని అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ మహిళను 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మెళియాపుట్టి మండలం బావనాపురం గ్రామానికి చెందిన దుంప అనూష అనే వివాహిత తన ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని మనస్థాపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె అత్తవారిది పలాస పట్టణం కాగా, తన భర్త పనికోసం ఇతర దేశానికి వెళ్లాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

### వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరినవారితో కేవీజీ సత్యనారాయణ

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరాయి. వీరికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో బగాది రామారావుతోపాటు మరో నాలుగు కుటుంబాలు ఉన్నాయి. కార్యకర్తలపై టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు ధోరణికి విసుగు చెంది వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. త్వరలో మరిన్ని కుటుంబాలు చేరుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు, గొండు రామకృష్ణ, పైడి చలపతిరావు, సువ్వారి అన్నంనాయుడు, గండెం రాము తదితరులు పాల్గొన్నారు.

### నాగావళిలో మునిగి విద్యార్థి మృతి



దుర్గాప్రసాదు మృతదేహం



సరుబుజ్జిలి: బూర్జ మండలంలోని లాభాం వద్ద నాగావళి నదిలో ప్రమాదవశాత్తు మునిగి ఇంటర్మీడియట్ విద్యార్థి సాసుపల్లి దుర్గాప్రసాదు(19) ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం బెల్లంకి వీధికి చెందిన దుర్గాప్రసాద్ తన స్నేహితులు ఐదుగురితో కలిసి లాభాం గ్రామం వద్ద నాగావళి నదిలో స్నానానికి దిగాడు. అయితే అతను లోతులో చిక్కుకుపోయి ఈతరాక మునిగిపోయినట్లు స్నేహితులు తెలిపారు. కాపాడే ప్రయత్నం చేసినా విఫలం కావడంతో సమీపంలో ఉన్న లాభాం గ్రామస్తులకు యువకులు సమాచారం అందించారు. అయితే అప్పటికే యువకుడు చనిపోయాడు. దుర్గాప్రసాదు పాలకొండ తమ్మినాయుడు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడికు తండ్రి రాము, తల్లి భారతి, చెల్లి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక వెల్లడించారు.

### ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు



ట్రాఫిక్ నిలుపుదల చేయడంతో మిల్లు జంక్షన్‌లో బారులుతీరిన వాహనదారులు

శ్రీకాకుళం: జిల్లాకు హోంమంత్రి అనిత ఆదివారం విచ్చేసిన నేపథ్యంలో నగరంలో పోలీసులు అమలు చేసిన ట్రాఫిక్ ఆంక్షలు ప్రజలను ఇబ్బందులకు గురి చేశాయి. హోం మంత్రి అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చినప్పుడు మిల్లు జంక్షన్‌లో 15 నిమిషాలకు పైగా ట్రాఫిక్‌ను నిలుపుదల చేశారు. ఇలా ఆమె ప్రయాణించిన మార్గాల్లో 10 నుంచి 15 నిమిషాల పాటు రాకపోకలను నిలుపుదల చేశారు. దీంతో తీవ్రమైన ఎండకు తట్టుకోలేక వాహనదారులు విలవిలలాడారు.

# సై డర్..!



మన ఇంట్లో బంగారం పోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. మన కుటుంబంపై ఎవరైనా దాడికి పాల్పడినా.. ఆడపిల్లలను ఏడిపించినా.. ఎవరైనా మోసగించినా వెంటనే స్పందిస్తాం. అంతేవేగంగా పోలీసులు సైతం విచారణ చేపడతారు. సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే రూ.కోట్లలో మోసాలకు పాల్పడే కంటికి కనిపించని, పరిచయం లేని సైబర్ మోసగాళ్లపై పరువు అనే సమస్యకు భయపడి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మాత్రం అంతా వెనకడుగు వేస్తారు. ఎందుకంటే టెక్నాలజీ పరంగా, సామాజిక మాధ్యమాల పరంగా కొన్ని బలహీనతలకు లోబడి చేసే తప్పులు బయటపడితే ఇబ్బందులు వస్తాయని ఆగిపోతున్నారు. కుటుంబంలో తెలిస్తే బాధపడతారని రూ.లక్షల్లో మోసపోతున్నారు. కొంతమంది ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

- రెచ్చిపోతున్న సైబరాసులు
- రూ.కోట్లలో బాధితులకు టోకరా
- పరువు పేరుతో ఫిర్యాదు చేసేందుకు బాధితుల వెనకడుగు

గత కొన్ని నెలలుగా జిల్లాలోని ప్రజలు సైబర్ చక్రబంధంలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్ ఇతర సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన సైబరాసురులు హనీట్రాప్, డిజిటల్ అరెస్టు, ట్రేడింగ్, పార్ట్‌టైం జాబ్‌ల పేరిట రెచ్చిపోతున్నారు. రూ.లక్షల్లో పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులతో సుమారు ఏడెనిమిది కేసులు నమోదయ్యాయని, స్టేషన్ మెట్లెక్కని బాధితులు మరింతమంది ఉండొచ్చని పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. మోసపోయినవారిలో ఉన్నత ఉద్యోగ వర్గాలే ఉండడం విశేషం.

### హనీ ట్రాప్‌లో పడి..



జిల్లాకేంద్రం సమీపంలోని సంపన్న వర్గానికి చెందిన ఒక వ్యక్తికి ఇటీవల ఒక అమ్మాయి వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెట్టింది. ప్రొఫైల్ పిక్‌లో అమ్మాయి ఫొటో ఉండడంతో ఆకర్షితమైన సదరు వ్యక్తి వెంటనే హాయ్ అని రిప్లయ్ ఇచ్చాడు. ఆ తర్వాత నిత్యం చాటింగ్ చేయడం రివాజైంది. కొన్నాళ్లకు వాట్సాప్ కాల్‌లో మాట్లాడడం.. వీడియో కాల్స్ చేయడం ఆరంభించింది. అలా ఆ వ్యక్తిని ముగ్గులోకి దింపిన యువతి వీడియో కాల్స్‌లో న్యూడ్ కాల్స్ చేయడం ప్రారంభించింది. కొద్దిరోజులు తానే న్యూడ్‌గా కనిపించి ఆ తర్వాత సదరు వ్యక్తిని సైతం న్యూడ్‌గా కనిపించాలని కోరిక కోరడంతో, అతడు కూడా నగ్నంగా మాట్లాడడం ఆరంభించాడు. దీంతో ఆ వ్యక్తి నగ్నంగా మాట్లాడిన వీడియో కాల్‌ను రికార్డింగ్ చేసిన ఆ యువతి అక్కడి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేయడం ఆరంభించింది. ఆమె తరఫున మరికొంతమంది సైతం వీడియోలు బయటపెడతామంటూ బెదిరించడంతో ఇంట్లో తెలిస్తే పరువు పోతుందేమోనని భయపడి, చేసేదేమీలేక వారు చెప్పిన బ్యాంకు ఖాతాలకు దఫదఫాలుగా రూ.28 లక్షల వరకు పంపించేశాడు. అయినప్పటికీ డబ్బుల కోసం పీడిస్తుండడంతో చేసేదేమీలేక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### డిజిటల్ అరెస్టు పేరిట..



విశాఖపట్నంలోని ఒక అకౌంటింగ్ సెక్షన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీకాకుళం నగరవాసి డిజిటల్ అరెస్టు పేరిట రూ.11 లక్షలను సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోయారు. మీ పేరిట కొరియర్‌లో డ్రగ్స్ ప్యాకెట్ వచ్చిందని.. మీ ఆధార్ లింక్ నంబర్‌తో కొన్ని ఆర్థిక లావాదేవీలు జరిగాయని సీబీఐ, కస్టమ్స్ అధికారులు అరెస్టు చేసే వీలుందని ఒక వ్యక్తి బెదిరించడంతో నిజమేనని నమ్మాడు. దీనినుంచి బయటపడాలంటే ముందుగా రూ.30 వేలు తాము చెప్పిన ఖాతాలో వేయాలని చెప్పడంతో ఎందుకొచ్చిన గొడవలే అనుకుని ఉద్యోగి వేశాడు. మళ్లీ ఆ వ్యక్తి ఫోన్ చేసి పై అధికారులను మేనేజ్ చేయడం కుదరడం లేదని.. వారే మీకు లైన్‌లోకి రావొచ్చని మెల్లగా జారుకున్నాడు. కొన్ని గంటల్లోనే పోలీసు సెటప్‌తో ఉన్న ఓ రూంలో యూనిఫాంతో ఓ వ్యక్తి వీడియో కాల్‌లో ప్రత్యక్షమై తాను ఢిల్లీ సీబీఐ అసిస్టెంట్ డైరెక్టర్‌నని పరిచయం చేసుకున్నాడు. మేం నిన్ను నమ్మాలంటే మీ బ్యాంకు అకౌంట్లు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లు వెరిఫికేషన్ చేయాలన్నాడు. వాటి ఆధారంగా ఇటీవల జరిగిన ఆన్‌లైన్ లావాదేవీలు పరిశీలించాలని.. కొంత అమౌంట్‌ను కూడా వెరిఫికేషన్‌లో భాగంగా తీయాల్సి వస్తుందని చెప్పాడు. అందులో జెన్యూనిటీ ఉంటే తిరిగి మీ ఖాతాలో అమౌంట్ వేయడం జరుగుతుందని చెప్పడంతో సదరు ఉద్యోగి ఓకే చేశాడు. అడిగిన వివరాలు అన్నీ ఇచ్చేయడంతో పాటు ఓటీపీలు చెప్పడంతో రూ.11 లక్షలను కొట్టేశారు. దీంతో తాను మోసానికి గురయ్యానని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇదే తరహాలో జిల్లా కేంద్రానికి సమీపంలో ఓ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న జేఈ రూ.3 లక్షలు, నగరానికి చెందిన ఓ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రూ.3 లక్షలు పోగొట్టుకున్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారంటూ వీరిని సైబరాసురులు అధికారుల పేరిట బెదిరించడం విశేషం

### ఉపాధ్యాయుడికి టోకరా

నగర పరిసరాల్లో ఉండే ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఉన్నత చదువుల నిమిత్తం విదేశాల్లో ఉన్న తన కుమారుడు ఓ నేరం చేశాడని.. సీబీఐ, ఈడీ విభాగాల అధికారులు అరెస్టు చేసే వీలుందని సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. దానికి తగ్గ ఆధారాలు తమ వద్దనున్నాయని చెబుతూనే ఫేక్ వివరాలు వాట్సాప్‌లో పంపడంతో ఉపాధ్యాయుడు ఖంగుతిన్నాడు. మీ అబ్బాయి నేరం నుంచి బయటపడి, విదేశాల నుంచి రావాలనుకుంటే అధికారులకు అమౌంట్ కట్టాల్సి ఉంటుందన్నారు. పత్రికలు, మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం బయటకు తెలిస్తే మీ పరువు పోతుందని అనడంతో చేసేదేమీలేక రూ.35 లక్షలు వారు చెప్పిన వివిధ ఖాతాల్లోకి పంపించాడు. ఎక్కడ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తాడోనని గంట గంటకు ఉపాధ్యాయునికి వాట్సాప్ వీడియో కాల్ నేరస్తులు చేసేవారు. తర్వాత వాళ్ల నంబర్లకు ఫోన్ కాకపోవడంతో బాధిత ఉపాధ్యాయుడు మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

### పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్స్..

వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌ల్లో పరిచయమైన కొంత మంది వ్యక్తులు ఇంట్లోనే ఉంటూ పార్ట్‌టైం జాబ్ చేసే వీలుందని చెప్పడంతో నగరంలో నలుగురు చిరుద్యోగులు ఈ ఉచ్చులో పడ్డారు. ముందుగా వారు క్రియేట్ చేసిన గ్రూపుల్లో మెంబర్లుగా చేరారు. మొదటి టాస్క్‌లో రూ.5 వేలుకు రూ.1000లు అదనంగా రూ.6 వేలు, రెండో టాస్క్‌లో రూ.10 వేలకు రూ.2 వేలు అదనంగా రూ.12 వేలు వేయడంతో విత్‌డ్రా చేసుకున్నారు. అనంతరం అత్యాశకు పోయి తర్వాత టాస్క్‌ల్లో రూ.30 వేలు, రూ.50 వేలు, రూ.1 లక్ష, రూ.2 లక్షలకు అదనపు సొమ్ము ఖాతాల్లో ఉన్న ఆప్షన్‌లో చూపించినా విత్‌డ్రా చేయడానికి వీలుకాకపోవడం.. ఆ తర్వాత అవతలివాళ్లు వీరి నంబర్లు బ్లాక్ చేయడంతో మోసపోయామని గ్రహించారు.

### పోలీసులకు ఆసక్తి ఉన్నా..

పోలీసులు కూడా కేసులు నమోదు చేస్తున్నా మోసం చేసే సైబర్ కేటుగాళ్లు రాష్ట్రాలు, దేశాలు దాటి విదేశాల్లో సైతం ఉండడం.. తెలియని ప్రాంతాల్లో రిస్క్ చేసి పట్టుకోవడానికి వెళ్లే ఆసక్తి ఉన్నా.. రాను పోను ఖర్చులు, వసతి ఖర్చులకు చేతి చమురు తగులుతుండటం.. ఆపై ఎక్కువ రోజుల సమయం వెచ్చించాల్సి రావడంతో వెనకడుగు వేస్తున్నారు. అలా కేసుల్లో అధికశాతం పెండింగ్ ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువలన ప్రభుత్వాలు కాస్త చొరవ తీసుకుని ఆర్థికంగా చేయూతనిస్తే కేసుల ఛేదన సులభమేనంటూ పోలీసులు చెబుతున్నారు.

### క్షణాల్లో మోసాన్ని గ్రహించాలి



సహజంగా జరిగే చోరీలు.. ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న సైబర్ మోసాలను పరిశీలిస్తే 1:10 నిష్పత్తిలో నగదు మోసానికి గురవుతోంది. సైబర్ నేరగాడు బాధితుడి ఆర్థిక స్థితిని చూడడు. అత్యాశనే చూస్తాడు. వారు చేసే మోసాన్ని క్షణాల్లో మనం గ్రహించి స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే నష్టాన్ని పూడ్చవచ్చు. ఈవిధంగానే ఇటీవల డిజిటల్ అరెస్టు వలలో పడి రూ.13.5 లక్షల పోగొట్టుకున్న జెమ్స్ వైద్యురాలి కేసు ఛేదించాం. కోచిగూడ్, మైసూర్ వెళ్లి నిందితులను పట్టుకున్నాం. రాష్ట్రంలో రోజుకి రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు బాధితులు నష్టపోతున్నారు.

– సీహెచ్ పైడపునాయుడు, సీఐ, శ్రీకాకుళం రూరల్

## ఆదిత్యుని సన్నిధిలో హోం మంత్రి అనిత



హోం మంత్రి అనితకు ఆదిత్యుని చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో ప్రసాద్, శంకరశర్మ తదితరులు

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఈమెకు ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మలు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేశారు. తన పేరిట సూర్యనమస్కారాల పూజలను చేయించాలని ఆమె ప్రధానార్చకులు శంకరశర్మను కోరారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. మద్యం స్కాం కేసు వ్యవహారాలపై స్పందిస్తూ చట్టం తన పని తాను చేసుకుంటుందని వ్యాఖ్యానించారు. ఆమెతో పాటు ఎస్పీ మహేశ్వర రెడ్డి, టీడీపీ డివిజన్ ఇన్‌చార్జిలు తెలుగు నాగరత్నం, ఉంగటి వెంకటరమణ, అంబటి లక్ష్మీరాజ్యం, రాయిపల్లి అర్జున్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా తనను కలవడానికి వచ్చిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాదాలను మంత్రి అనిత మొక్కి ఆశీర్వచనాన్ని తీసుకున్నారు. అలాగే ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా మంత్రి అనిత చేతికి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మంగిపూడి ప్రసాద్ ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌ను కట్టారు.

**కూర్మనాథుని సన్నిధిలో...**

గార: ఆదికూర్మ క్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుడిని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహత్యాన్ని తెలియజేశారు. ఈవో కె.నరసింహనాయుడు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, కిషోర్‌బాబు తదితరులు ఉన్నారు.

## పుస్తెల తాడు అపహరణ

ఎచ్చెర్ల: మండలంలో ఫరీదుపేట పంచాయతీ వరం కాలనీలోని ఎల్లా పంతుల వరలక్ష్మికి చెందిన రెండున్నర తులాల పుస్తెల తాడును ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. వరలక్ష్మి ప్రతిరోజూ ఉదయం వాకింగ్ చేస్తుంది. ఆదివారం కూడా అదే కాలనీలోని ఒకటో నంబర్ రోడ్డులో వాకింగ్ చేస్తుండగా, గమనించిన గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును తెంచుకొని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 7న సురేఖ పాణిగ్రాహి సంతాప సభ

పలాస: మండలంలోని బొడ్డపాడులో ఈనెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రముఖ విప్లవ కవి, శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాట యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి సంతాప సభ నిర్వహించనున్నట్లు సంతాప సభ నిర్వహణ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు తెలియజేశారు. ఈ మేరకు సంతాప సభ కరపత్రాలు, వాల్ పోస్టర్లు బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేఖ పాణిగ్రాహి సంతాప సభ నిర్వహించుకోవడమంటే ఆనాటి శ్రీకాకుళం పోరాటాలు, ఆ పోరాటంలో అమరుల త్యాగాలను గుర్తు చేసుకోవడమేనన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం



తోటపల్లి కాలువను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- తోటపల్లి కాలువ పరిశీలన

రణస్థలం: కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆరోపించారు. మండలంలో కొండ ములగాం గ్రామ సమీపంలోని తోటపల్లి కాలువను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు అందించడంలో పాలకులు విఫలమయ్యారని దుయ్యబట్టారు. గత రెండేళ్లుగా సరైన వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతుంటే సాగునీరు అందించాలనే ఆలోచన కూటమి పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా ఒకే విడతలో రైతన్నలకు రూ.20 వేలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికి, నేడు కంటి తుడుపుగా రూ.7 వేలు మాత్రమే అందించారని మండిపడ్డారు. తోటపల్లి కాలువ పనులను వైఎస్సార్‌సీపీ హయాంలో 90 శాతం పూర్తిచేస్తే, మిగిలిన 10 శాతం పనులు చేయలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేయం విడ్డూరంగా ఉందన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని మద్దువలస, తోటపల్లి కాలువ నీరు అందించకపోవడంతో వరి వెదలు ఎండిపోతున్నాయన్నారు. కాలువ పరివాహక ప్రాంతాల్లోని పరిస్థితి ఇలా ఉంటే, నియోజకవర్గంలోని మిగతా ప్రాంతాల పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. తోటపల్లి కాలువ సాగునీరు వెంటనే విడిచిపెట్టాలని లేకుంటే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు, నాయకులు గొర్లె అప్పలనాయుడు, కలిశెట్టి కన్నంనాయుడు, మజ్జి రమేష్, గొర్లె అప్పలనర్సునాయుడు, రెడ్డి వాసు, బవిరి రమణ, కెల్ల రామకృష్ణ, మీసాల రామారావు పాల్గొన్నారు.

## చలో విజయవాడ విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరుతూ అసెంబ్లీ సమావేశాలు జరగనున్న సమయంలో చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, తక్షణమే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం అందించే విధంగా మినిమమ్ ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని, గతంలో జరిగిన సమ్మె ఒప్పందాలను అమలు చేసి వేతన పెంపు కల్పించాలన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులకు ఈపీఎఫ్, గ్రాట్యూటీ, మెడికల్ సెలవులు, హెల్త్ కార్డులు వంటి హక్కులు కల్పించాలని విన్నవించారు. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యా వ్యవస్థ రాజకీయ దుర్వినియోగానికి గురవ్వకుండా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు పి.తేజేశ్వరరావు, జిల్లా నాయకులు ఎల్వీ రమణ, ఎం.ఉమాపతి, లోకేశ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం



ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హిర మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1986–93 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ మిత్రులంతా కలిసి నాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. మృతి చెందిన తోటి మిత్రులకు నివాళులర్పించారు. సరదాగా ఆటలు, పాటలతో ఆనందంగా గడిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఒడిశా తదితర దూరప్రాంతాల నుంచి కూడా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో వారణాసి రాజారెడ్డి, హిరమండలం వైస్ ప్రెసిడెంట్ వెలమల బాలరాజు, లాలిశెట్టి కుమార్, రామకృష్ణ, శశికళ, ప్రవా రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

## విజేతలకు అభినందనలు



పతకాలతో విజేతలైన చిన్నారులు

ఇచ్ఛాపురం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో విజేతలైన చిన్నారులకు స్థానిక తైక్వాండో క్లాస్ ఆవరణలో అభినందన సభ ఆదివారం నిర్వహించారు. విజయవాడలో గత నెల 25వ తేదీ నుంచి 27 వరకు జరిగిన జాతీయ స్థాయిలో తైక్వాండో పోటీల్లో ఇచ్ఛాపురం నుంచి 25 మంది చిన్నారులు పాల్గొని పతకాలు సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో పి.లాస్యన్, మహేష్, జోషిక, కృతిజ్ఞ, ఉపాసన బంగారు పతకాలు, భవిష్య, వర్షిని, సత్యశ్రీ, యశ్వంత్, సాయి, సిద్ధార్థ రజిత పతకాలు, సోనాక్షి, సాయి, చాణిక్య, అభిరామ్‌లు కాంస్య పతకాలతో మెరిశారు. సబ్ జూనియర్ రెగ్యూలర్ విభాగంలో యశ్విత (బంగారు), చెన్నూరు హర్షని (రజిత), క్యాడెట్ విభాగంలో పటాన దమయంతి (బంగారు), చెన్నూరు జాహ్నవి(రజిత), జూనియర్ విభాగంలో సీహెచ్ గిరి (కాంస్య), సీనియర్ విభాగంలో అనపాన భువనేశ్వరి(రజితం), అనపాన డోలి (కాంస్య), పూమ్సే విభాగంలో అనపాన డోలి(రజితం), పిలక సత్యశ్రీ (కాస్యం), అనంకృతజ్ఞ (కాస్యం) పతకాలు సాధించారు. దీంతో కోచ్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో వజకరప్పు కీర్తన, డాక్టర్ శేషు యాదవ్, పిలక విజయ్ భాస్కరరెడ్డి, సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి, రాంబాబు, శ్రీను, కృష్ణయ్య, ఆనంద్, లత తదితరులు పాల్గొన్నారు.